క్లుప్తంగా

రైతాంగానికి ప్రభుత్వం పెద్దపీట



సబ్సిడీ విత్తనకాయలను అందిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిలు

నంబేపల్లి : రైతాంగానికి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దేవపట్ల రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి రైతులకు సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతులపై ప్రత్యేక దృష్టి సారించడంతో ఎన్నో పథకాలు అమలు చేసి రైతే రాజుగా ఉండాలనేది ప్రభుత్వ ధ్యేయమని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకట మురళీ మోహన్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ వాసుదేవరెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీల చోరీ

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె అర్బన్ పంచాయతీకి చెందిన ట్రాక్టర్లలోని రెండు బ్యాటరీలను గుర్తుతెలియని దొంగలు చోరీ చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం సర్పంచ్ జంబు సూర్యనారాయణ విలేకరులకు తెలిపారు. పంచాయతీ ఆవరణలో ఉన్న ట్రాక్టర్లలోని బ్యాటరీలు చోరీకి గురైనట్లు సిబ్బంది గుర్తించారన్నారు. రెండురోజుల క్రితం గొల్లపల్లెలో పంచాయతీ మంచినీటి సరఫరా కేబుల్ దొంగలించిన సంగతి తెలిసిందే. తాజాగా ట్రాక్టర్‌లోని బ్యాటరీలు చోరీకి గురికావడంతో పంచాయతీ సిబ్బందిలో ఆందోళన వ్యక్తమవుతోంది.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ



సిద్దవటం : మందపల్లె గ్రామంతోపాటు మరికొన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు స్థానిక సర్పంచ్ తుర్రా చిన్నక్క ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారని ఏపీఓ శైలజ అన్నారు. వేసవి కాలంలో అధిక ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకొని ఉపాధి కూలీలకు వడదెబ్బ తగలకుండా సర్పంచ్ కూలీలకు మజ్జిగ పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. సర్పంచ్‌కు కూలీల తరపున ఏపీఓ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు తుర్రా ప్రతాప్, నాగం నరసింహారెడ్డి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

వీరాంజనేయుడి తిరునాల

వీరబల్లి (రాయచోటి టౌన్) : వీరబల్లె మండలం సానిపాయి సమీపంలోని మర్రిచెట్టు సమీపాన వెలసిన ఆంజనేయుడి తిరునాల ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఉమ్మడి కడప జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. తిరునాలలో రాజంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అలాగే రాత్రి గ్రామ సర్పంచ్ నేతి ఆంజనేయుల ఆధ్వర్యంలో చాందినీ బండ్లు కట్టించి ఘనంగా మెరవణి నిర్వహించారు. కార్యక్రమంలో సుండుపల్లె వైఎస్సార్‌సీపీ నాయకులు అజయ్‌రెడ్డి, అజంతమ్మ, సీతంపేట వెంకటరాజు, ఓదివీడు శివరామ పాల్గొన్నారు.

శానిటరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: గ్రామ వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న శానిటరీ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని శానిటరీ ఎన్విరాన్మెంటల్ సెక్రటరీల అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయం ఉద్యోగులపై జరుగుతున్న వేధింపులను ఆపాలన్నారు.

గ్యాస్ లీకై విద్యార్థికి గాయాలు

మదనపల్లె : స్టవ్ రిపేరీ దుకాణంలో గ్యాస్ లీకై మంటలంటుకుని విద్యార్థి తీవ్రంగా గాయపడిన సంఘటన శుక్రవారం రాత్రి మదనపల్లె పట్టణంలో చోటు చేసుకుంది. చలపతిరావు కాలనీలో నివాసమున్న హైదర్‌సాబ్ కుమారుడు షేక్ సమీర్ (14) స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. సెలవులు కావడంతో చలపతిరావు కాలనీలో ఉన్న స్టవ్ రిపేరీ దుకాణానికి పనికి వెళ్లాడు. స్టవ్ రిపేరీ చేస్తున్న సమయంలో గ్యాస్ లీకై ప్రమాదవశాత్తు మంటలంటుకున్నాయి. ప్రమాదంలో విద్యార్థి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు బాధితున్ని స్థానిక ఆసుపత్రికి తరలించారు.

రాజ్యాధికారం కోసం ఉద్యమించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బహుజనులు రాజ్యాధికారం కోసం ఉద్యమించాలని బహుజనుల విద్యావంతుల వేదిక అధ్యక్షుడు జెవి కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బడుగు, బలహీన వర్గాల నేతల సమావేశం నిర్వహించారు.

రైతన్నకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం

- సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి
- చిట్లూరులో గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న శ్రీకాంత్‌రెడ్డి



వలంటీర్లను సన్మానించిన ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి



విత్తన పంపిణీలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడి

రామాపురం : రైతన్నకు వెన్నుదన్నుగా జగన్ ప్రభుత్వం నిలిచిందని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చిట్లూరు వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో సబ్సిడీ వేరుశనగ విత్తనకాయలను పంపిణీని ఆయన ప్రారంభించారు. మాట్లాడుతూ ప్రతి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో నాణ్యమైన, నమ్మదగిన వేరుశనగ విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీతో ఖరీఫ్ సీజన్‌లో ముందస్తుగానే అందిస్తున్నారన్నారు. 40శాతం సబ్సిడీతో 30 కిలోల నారాయణి రకం రూ.1,773లు, కే6 రకం రూ.1,675కు అందిస్తున్నామన్నారు. అవసరమైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని, వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బంది ముందస్తు ప్రణాళికలతో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి విత్తన పంపిణీ సజావుగా జరిగేలా కృషి చేయాలన్నారు.

వేరుశనగకు గిట్టుబాటు ధర

ప్రభుత్వం అన్ని పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించిందన్నారు. ఈ ఏడాది 42 కిలోల నారాయణి వేరుశనగ రకం రూ.3,800లు ధర పలికిందన్నారు. పంట సాగు చేసిన రైతులకు నాణ్యమైన విత్తనం దొరుకుతోందన్నారు. ప్రభుత్వ చర్యలతోనూ, మినిమమ్ సపోర్టు ప్రైస్‌తో లక్ష్యానికి మించి వేరుశనగ పంట సాగు అయ్యే సూచనలు కనిపిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ, మండల కన్వీనర్ జనార్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఏఓ నాగమణి, హార్టికల్చర్ అధికారిణి నాగమణి, వైస్ ఎంపీపీలు రవిశంకర్‌రెడ్డి, బాబు, సర్పంచ్ రామాంజులు, మాజీ సర్పంచ్ మురళీమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ చిన్న నరసింహులు, మాజీ ఎంపీపీ నారాయణ, మాజీ ఎంపీటీసీ హరినాధరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారెడ్డి, ఆదిరెడ్డి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు శివశంకర్, సింగల్ విండో అధ్యక్షుడు పెద్దిరెడ్డి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమ కాంతులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అందిస్తున్న నవరత్నాలతో ఇంటింటా సంక్షేమకాంతులు విరాజిల్లుతున్నాయని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని చిట్లూరు గ్రామంలో ఉదయం 6 గంటల నుంచే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. చెరువుముందరపల్లె, మజ్జిగవాండ్లపల్లె, శనక్కాయలవాండ్లపల్లె, వీరయ్యగారిఇండ్లు, రాఘవరెడ్డిగారిపల్లె, చిట్లూరు దళితవాడ, ముసల్‌రెడ్డిగారిపల్లె, నారాయణరెడ్డిగారిపల్లెలలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి నిర్వహించిన కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసున్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదో అన్నది తెలుసుకోవడం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ వద్దకు పంపించారని ప్రజలకు ఆయన వివరించారు.

సంక్షేమ పథకాలపై ప్రజల్లో సంతృప్తి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి రెండో, మూడు అందుతున్నాయని చిట్లూరు గ్రామ ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఎవరి సిఫారసు లేకుండా అర్హత ఉన్న వారికి నేరుగా సంక్షేమ ఫలాలను లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయడం ఒక చరిత్ర అని ప్రజలు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. తమ సంక్షేమం కోసం కృషి చేస్తున్న సీఎం జగనన్న ఎల్లప్పుడూ చల్లంగా ఉండాలంటూ ప్రజలు దీవించారు. ఈ ప్రభుత్వానికి తామెప్పుడూ అండగా ఉంటామని శ్రీకాంత్‌రెడ్డి ఎదుట ప్రజలు స్పష్టం చేశారు. దృష్టికి వచ్చిన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించడంపై ప్రజలు శ్రీకాంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. చిట్లూరు దళితవాడలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి దళితులు ఇంటింటా ఆత్మీయ స్వాగతాలు పలికారు. దళితుల సంక్షేమానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, పక్షపాతిగా సీఎం జగన్ పేరొందని ఇంటింటా దళితులు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎదుట ఆనందం వ్యక్తం చేశారు.

దేశానికి ఆదర్శం వలంటీర్ల వ్యవస్థ

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన సచివాలయం, వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో జరిగిన మండల వలంటీర్లకు వందనం కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. మాట్లాడుతూ ఉత్తమ వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర మూడు కేటగిరిలో ప్రభుత్వం వరుసగా మూడవ ఏడాది అవార్డులతో సత్కరించిందన్నారు. వివక్ష, అవినీతికి తావులేకుండా వలంటీర్ల వ్యవస్థ పనిచేయాలని సూచించారు. గ్రామ, వార్డు వలంటీర్లు తమ పరిధిలోని కుటుంబాలకు చేదోడు, వాదోడుగా నిలిచి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు.

నందలూరులో మొదలైన ఆర్‌యూబీ పనులు

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వేకేంద్రంలో (నందలూరు-పాటూరు రైల్వేగేటు)లో నూతనంగా ఆర్‌యూబీ నిర్మాణానికి శుక్రవారం చేపట్టారు. భారతీయ రైల్వేలో ఎల్‌సీ గేట్లు ఎత్తివేసే క్రమంలో ఆర్‌యూబీ నిర్మాణం చేపట్టింది. దాదాపు రూ.6కోట్ల వ్యయంతో ఈ నిర్మాణం చేపట్టనున్నారు. డివిజన్ కేంద్రం కన్‌స్ట్రక్షన్ విభాగం నేతృత్వంలో పనులు కొనసాగనున్నాయి. కాగా ఆర్‌యూబీ నిర్మాణం రైల్వే స్థలంలో చేపట్టే విధంగా ప్లాన్ రూపొందించారు. ఈ నేపథ్యంలో వందేళ్ల కాలం నాటి పర్మనెంట్ వే విభాగపు కార్యాలయాన్ని తొలగించనున్నారు. స్టేషన్‌కు ముందువైపు, వెనుకవైపు ఉన్న క్వార్టర్స్, రైల్వే భవనాలను తొలగించనున్నారు. ఇప్పటికే ఆర్‌యూబీ ఉన్నప్పటికి, అదనంగా భారీ వాహనాలు వెళ్లేలా ఆర్‌యూబీని నిర్మిస్తున్నారు. వర్షాల సమయంలో నీటి నిల్వ సమస్య తలెత్తకుండా ముందుస్తుగానే నిర్మాణం చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఆర్‌యూబీ నిర్మాణం వల్ల రైల్వేగేటు వద్ద వారు తాము వ్యాపారపరంగా దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని పలువురు చిరువ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రారంభమైన ఆర్‌యూబీ పనులు

వలంటీర్లు సంక్షేమ వారధులు



వలంటీర్లను సన్మానిస్తున్న ఎంపీపీ విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు(రాజంపేట) : వలంటీర్లు సంక్షేమ వారధులని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పురస్కారాలను వలంటీర్లకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్ల సేవలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించే వారికి ప్రోత్సాహక పురస్కారాలను అందజేస్తున్నారన్నారు. అర్హులైన వారికి ప్రభుత్వ ఫలాలు అందాలంటే అందులో కీలకం వలంటీర్లు అని అన్నారు. దుర్గాపురం సచివాలయం - 2 పరిధిలో వలంటీర్‌గా పని చేస్తున్న రమేష్‌కి సేవారత్న అవార్డు రావడం గర్వకారణమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి జీవీసుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ సయ్యద్ అమీర్, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలీం, జిల్లా రైతు విభాగం ప్రధానకార్యదర్శి గీతాల నరసింహారెడ్డి, బీసీ నాయకుడు తుమ్మల శ్రీధర్‌గౌడ్, దళితనేత పణలత రామచంద్ర, మోడపోతుల రాము, అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో భద్రకాళి

రాయచోటి టౌన్ : భద్రకాళి అమ్మవారికి రాహుకాల పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శుక్రవారం ఆలయ పాలక మండలి చైర్మన్ పొలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలు, నిమ్మకాయల హారాలతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు హారతులు పట్టారు. అర్చకులు భక్తులకు రాహుకాల పూజల విశిష్టతను వివరించారు.

వేలిముద్రలు పడకుంటే ఐరిష్ ద్వారా రేషన్ ఇవ్వండి

రాజంపేట : రేషన్‌షాపులలో లబ్ధిదారులకు ఎవరికైనా చాలకాలంగా వేలిముద్రలు పడకుండా ఉంటే కళ్ల ఐరిష్ ద్వారా రేషన్ ఇవ్వాలని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసులు మొబైల్ ఇండియా ఆపరేటర్లకు సూచించారు. శుక్రవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ కార్యాలయంలోని సభా భవనంలో డివిజన్ పరిధిలోని 17 మండలాలకు చెందిన ఎండీయూలుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గ్రామాల్లో 17వ తేదీ లోపల రేషన్ ఇంటింటికి తీసుకెళ్లి పంపిణీ చేయాలన్నారు. లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టరేట్ డీటీ సాయి, రైల్వేకోడూరు డీటీ ప్రసాద్, డివిజన్‌లోని 17 మండలాలు చెందిన మొబైల్ ఎండీయూ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



ఆపరేటర్లకు ఐరిష్ కెమెరాలు ఇస్తున్న రెవెన్యూ అధికారులు

30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలి

రాయచోటి అర్బన్ : జిల్లా కేంద్రమైన రాయచోటిలో 30 పడకలతో ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజనేయులు, ఉపాధ్యక్షురాలు ఓబులమ్మలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రెడ్డీస్ కాలనీలోని బీడీ కార్మికుల ఆసుపత్రి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. అ సంఘటిత రంగ కార్మికులకు వైద్యం పేరుతో పట్టణంలోని బీడీ కార్మికుల ఆసుపత్రి పేరుతో ఉన్న దవాఖానాలో అరకొరగా వైద్యం అందుతోందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా ఆసుపత్రిలో రెగ్యులర్ వైద్యులు, తగినంత సిబ్బంది లేరన్న సాకుతో శ్రీకాళహస్తికి చెందిన డిస్పెన్సరీ డాక్టర్ వారంలో రెండురోజులు మాత్రమే రోగులకు వైద్యసేవలందిస్తున్నారన్నారు. మిగిలిన రోజుల్లో కార్మికులకు వైద్యం అందడం ప్రశ్నార్థకం అయ్యిందన్నారు. ఈవిషయాన్ని అధికారులు గుర్తించి వెంటనే కార్మికుల సౌకర్యార్థం పట్టణంలో ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మించాలంటూ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, సీఐటీయూ నాయకురాళ్లు సిద్దమ్మ, విజయతోపాటు బీడీ కార్మికులు లక్ష్మిదేవి, అన్సారీ, రమీజా, గంగులమ్మ, బద్రినాథ్ పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీఐటీయూ శ్రేణులు

బాండ్ల మంజూరులో జాప్యాన్ని నివారించండి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐ చెల్లింపులు, బాండ్ల మంజూరులో జరుగుతున్న తీవ్ర జాప్యాన్ని నివారించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి కోరారు. శుక్రవారం కడపలోని ఏపీజీఎల్ఐ కార్యాలయంలో ఆశాఖ సహాయ సంచాలకులు రమేష్‌కుమార్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల తుది చెల్లింపులు, మరణించిన ఉపాధ్యాయుల డెత్ క్లెయిమ్ చెల్లింపులు కూడా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వాటిని చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీ

లక్కిరెడ్డిపల్లె : అనంతపురం గ్రామ రైతు భరోసా కేంద్రంలో పచ్చిరొట్ట ఎరువులుగా ఉపయోగపడే జీలుగ విత్తనాలను సర్పంచ్‌లు వెంకటనారాయణ రెడ్డి, గడ్డం కళ్యాణి, ప్రభాకర్ రెడ్డిలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయకులు నాగరాజు మాట్లాడుతూ జీలుగ విత్తన సబ్సిడీ 50శాతం కాగా, ఒక్కో 10 కేజీల ప్యాకెట్ ధర రూ. 395లగా నిర్ణయించామన్నారు. విత్తనాల కోసం రైతు భరోసా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రైతు సోదరులు ఈ విత్తనాలను ప్రస్తుతం భూమిలో విత్తుకొని పైరు పూత దశలో ఉన్నప్పుడు మిల్లర్ సహాయంతో భూమిలో కలియదున్నుకుంటే భూమి సారవంతం పెరిగి, భవిష్యత్తులో రైతు సాగు చేయబోయే ప్రధాన పంటకు మంచి పోషకాలతోపాటు మంచి దిగుబడులు వస్తాయని ఆయన తెలియజేశారు.



రైతులకు జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచులు

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెనగలూరు : ఓబిలి వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరు వ్యక్తులలో ఒక వ్యక్తి మృతి చెందినట్టు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే ఓబిలి వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ ఇరువురిని రాజంపేటకు అనంతరం తిరుపతికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ యాహుద్దీన్ అనే వ్యక్తి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మరో వ్యక్తి తిరుపతి అమరా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

చేయూతనివ్వడాన్ని బాధ్యతగా భావించాలి

రాజంపేట రూరల్ : ఇతరులకు చేయూతనివ్వడాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించాలని జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి కోరారు. మండల పరిధిలోని ఆకేపాడులోని ఆకేపాటి ఎస్టేట్‌లో శుక్రవారం ఇద్దరు దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఆకేపాటి ఫౌండేషన్ ట్రస్ట్, రోటరీ క్లబ్ ఆఫ్ అన్నమయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. జెడ్పీ చైర్మన్ దివ్యాంగులకు ట్రైసైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనీల్‌కుమార్‌రెడ్డి, అన్నమయ్య క్లబ్ ప్రతినిదులు వంకన గురుప్రతాప్‌రెడ్డి, ఒ.వి. శివారెడ్డి, నాగ మహేశ్వరరెడ్డి, పి.జనార్దన్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులయాదవ్, మాదిరెడ్డిగారిపల్లి వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములురెడ్డి, సుబ్బరామరాజు తదితరులు పాల్గొన్నారు.



ట్రై సైకిల్స్ పంపిణీ అనంతరం దివ్యాంగులతో జెడ్పీ చైర్మన్ ఆకేపాటి, క్లబ్ ప్రతినిదులు

నేటి నుంచి ఎల్లమ్మ జాతర

పెనగలూరు : మండల కేంద్రంలో వెలసిన ఎల్లమ్మ జాతర నేడు శనివారం నుంచి జరగనున్నట్లు ఆలయ చైర్మన్ పి.సుబ్బారెడ్డి, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బ నరసయ్యలు తెలిపారు. గ్రామంలో వేణుగోపా స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు వచ్చే ఆదివారం ఎల్లమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీ అని తెలిపారు. శనివారం మధ్యాహ్నం గౌనేని కృష్ణమనాయుడు జ్ఞాపకార్థం వారి కుమారులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం గ్రామోత్సవం, రాత్రికి ఎల్లమ్మ ఆసాదుకథ ఉంటుందన్నారు.



ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

గడప గడపకు కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



వలంటీర్‌ను సత్కరిస్తున్న కొరముట్ల తదితరులు



ఓబులవారిపల్లె: బుక్‌లెట్ అందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మంగళంపల్లి సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డిలు నాయకులతో కలిసి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆప్యాయంగా పలుకరిస్తూ వారికి బుక్‌లెట్‌ను అందించి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. సంక్షేమ పథకాలు అందరికీ అందుతున్నాయా, సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సమస్యలు, రోడ్లు, భూముల సమస్యలపై ప్రజలు కొరముట్ల దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం కొరముట్ల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల వద్దకే పాలనను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఎక్కడా అవినీతికి తావులేకుండా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలలో జమ చేస్తున్నారన్నారు. ప్రపంచంలో ఎక్కడా అమలు కానటువంటి సంక్షేమ పథకాలు మన రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని అన్నారు. 2024 ఎన్నికలలో మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ జి.సుధాకర్ రాజు, జిల్లా వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ సుంకేసుల రఫీ, స్థానిక నాయకులు సుధాకర్ నాయుడు, తహసీల్దార్ పీర్ మున్ని, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, వలంటీర్లు పాల్గొన్నారు.

పథకాలకు వలంటీర్లే బ్రాండ్ అంబాసిడర్లు

రైల్వేకోడూరు : పథకాలకు వలంటీర్లే బ్రాండ్ అంబాసిడర్లు అని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయంపైన వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డిలు హాజరయ్యారు. ముందుగా సేవారత్న, సేవా వజ్రం, సేవా మిత్ర ద్వారా నగదును సాధించిన వలంటీర్లను అభినందించి సన్మానించి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ మాట్లాడుతూ వలంటీర్లకు వందనం సన్మాన కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. సేవా భావంతో సేవలందిస్తున్న వలంటీర్ల సేవలను గుర్తిస్తూ ఏపీ ప్రభుత్వం ప్రతి ఏటా ప్రోత్సాహకంగా సత్కారం చేస్తోందని పేర్కొన్నారు. వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేస్తున్నారన్నారు. వలంటీర్ల సేవలు వెల కట్టలేనివని స్పష్టం చేశారు. అజయ్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు చేరవేయాలన్నారు. సంస్కరణ వల్ల వలంటీర్ల వ్యవస్థ గొప్ప వ్యవస్థ అని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్లు సాయికిషోర్‌రెడ్డి, మండల నాగేంద్రలు, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, జెడ్పీటీసీ రత్నమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుబ్బరామరాజు, సర్పంచ్ శివయ్య, ఉప సర్పంచ్ తోట సాయి, ఎంపీడీఓ నాగార్జున, సిహెచ్.రమేష్, వైఎస్ కరీముల్లా, వీపీఆర్ కంట్రిగ సొసైటీ చైర్మన్ సుదర్శన్‌రాజు, ముస్తాక్, రఫీ, మహేశ్వర్‌రెడ్డి, పుష్పలత, పద్మారాణి, మహమ్మద్, నాగరాజు, దుర్గాప్రసాద్, రత్తయ్య, ఐదు మండలాల వలంటీర్లు పాల్గొన్నారు.